# 9. జీవధార

ఆ వీధిలో ఇల్లు దొరకడం నా అదృష్టంగానే భావించాను నేను. అందమైన వీధి అనొచ్చో అనకూడదో గానీ, నాకు మాత్రం నచ్చింది.

రోడ్డు మరీ విశాలంగా లేక పోయినా కనీసం ఒకేసారి రెండు కార్లు నడిచినా, అడ్డంగా పడుకొని ఉండే ఆబోతు మాత్రం లేవనక్కర్లేకుండా జరిగిపోతుంది. ఆ రోడ్డు అటూ ఇటూ అడ్డంగా ఒళ్ళు తెలీకుండా బలిసిపోతుందనే ఏమో, ఆ ప్రమాదాన్ని అరికట్టటం కోసం, రెండుపక్కలా ఓ అడుగుపాటి వెడల్పున్న రెండుగోతులు ఈచివరినుంచి ఆ చివరి దాకా తవ్వారు. గోతులున్నాయికదా అని వీధిలో అందరూ తమ ఇంట్లో ఉపయోగించిన నీళ్లను వృథాపోనివ్వక ఆ గోతులలోకి మళ్లించారు. ఒక్కొక్క చుక్క నీరు ఓ సముద్రమైనట్లుగా, అందరి ఇళ్లల్లో నీళ్లన్నీ కలిసి ఎంచక్కగా ఆ రోడ్డుకు బార్డర్‌లా ప్రవహించటం మొదలెట్టాయి.

దేశంలోనదులకు వరదలు ఎప్పుడోఒకసారి వస్తుంటాయికానీ, వీటికి మాత్రం నిత్యం వరదలే! ఎపుడూ నిండుగా ప్రవహించే గోదావరిలా కాకుండా, ఎపుడూ వరదలొచ్చే మహానదిలా అవి వరదలతో ఉంటాయి. వరదనీళ్లు ఊర్లోకి వచ్చినట్లుగానే, ఈ వరదనీరు రోడ్డుమీద కొచ్చేస్తుంది. ఇకపోతే పంపిణీ సమస్య. దేశంలో ఉన్న సమైక్యత అంతా ఇక్కడే ఉంది. స్వార్థపరులున్న దేశంలో నిస్వార్థపరులందరూ మా వీధిలోనే ఉన్నారు. అందుకే ఉదారంగా తమ యింటిలో నీళ్లనుకూడ కలిపి మొత్తం అంత నీటిని పక్క ఇంటి వేపే ప్రవహింపజేస్తారు అందరూ.

ఇవన్నీ కాకుండా నదుల్లో జంతువులుకాపురం ఉంటాయోఉండవో గానీ, ఇక్కడ మాత్రం చిన్నసైజు హిప్పోలాటి 'జాతిజంతువులు' కాపురం ఉంటున్నాయి. వీధిలోకి రాగానే ఈ వాతావరణం కనబడి నాకెంతో ముచ్చట వేసింది. అందుకే వెంటనే దానికి 'జీవనది' అని పేరు పెట్టుకొన్నాను.

ఆ వీధిలో చేరటంలో నా అదృష్టం ఎంతో నేనైనా చెప్పగలను కానీ, ఆ ఇంట్లో చేరడంలో మాత్రం ఆదిశేషుడైనా నా అదృష్టాన్ని కొనియాడలేదన్నది నగ్నసత్యం. ఇల్లు-ఇల్లంటే ఇల్లా అది? అదో చిన్న భారతదేశం. ఒక దేశాన్ని ఎన్ని ముక్కలు చేయడానికి వీలవుతుందో అన్నీ చేసినట్లుగా, ఆ పెద్దగదిని, చిన్నప్లైవుడ్ ముక్కలతో ఎన్నో భాగాలు చేశారు. భిన్నత్వంలోనే ఏకత్వం అన్నట్లుగా అన్నిటికీఒకటే కప్పు. మా దేశంలో ఎన్ని రాష్ట్రాలున్నా మేమంతా ఒకటే అని చెప్పటానికి ఉన్నట్లుగా, ఈ'గది'లో నుంచి ఆ'గది'లోకి హడావిడిగా తిరుగుతున్న ఎలుకలు, బొద్దింకలూ ఉన్నాయి. నా సామ్రాజ్యంలో ఉన్న ఆ సంఘీ భావానికి నేనెంతో గర్విస్తుండగనే రెండు ఎలుకలు క్షణం ఒకదాని దగ్గర ఒకటి ఆగి, రెండూ కలిసి ఒకే దిక్కుగా వెళ్ళాయి. దీనితో వాటి భావసమైక్యత కూడ నన్నెంతో ఆశ్చర్య పరిచింది. ఆనందింపజేసింది.

ఇంట్లో చేరిన రోజున నేను గమనించలేదుగానీ, మరునటి రోజున పొద్దున్న—యింకా తెల్లవారలేదు ఇంట్లో అన్నిటినీ సరిగా గమనించినా, తమన నేను గుర్తించలేదన్నట్టుగా, తమకూ గుర్తింపు అత్యవసరం అంటూ నా మీద తిరుగుబాటు చేసిన, ఆందోళన చెలరేపిన వ్యక్తులనొకసారి చూద్దామని నిద్రలేచి, లైటువేశాను. ప్రధానమంత్రి కోరినవెంటనే ఎన్నో అలజడులు ఆగిపోయినట్టు, ఆ క్షణంలో అలజడి ఆగిపోయి అండర్‌గ్రౌండ్‌లో చేరిపోయారు.

'ఇక పడుకోవాలి' అనుకొంటూ అలజడి అయిపోయాక, అంతా మర్చిపోయే రాజకీయవేత్తలా, అనుకొంటున్న సమయంలో మళ్ళీ కలకలం వినబడింది. ఈసారి ఈశబ్దం ఇంట్లోంచి కాక బయట నుంచి వస్తోంది.

నెమ్మదిగా బయటకు నడిచాను—ఈసారి నా అదృష్టానికి నేను మురిసి పోయాను - అక్కడ .... ఆ మసక చీకట్లో....ఇంకా తెల్లగా తెల్లవారని ఆ సమయంలో....మా యింటి ముందు గుంపొకటి నిలబడి ఉంది. వాళ్ళందరి ముందూ, వెనుకా కుండలు, బిందెలు ఉన్నాయి. బిందెల వాళ్లు తమ ఆధిక్యత చూపించటానికి కాబోలు, బిందెలమీద కూర్చొన్నారు. మిగతావాళ్లు కుండల పక్కన కులాసాగ కూర్చున్నారు. నాకు వాళ్ళంతా అక్కడ ఎందుకు కూర్చున్నారో తెలీలేదు. ఒకవేపుకు చూశాను. అటువేపు చివరి వరకూ కుండలే....రెండోవేపుకు చూశాను.

నాకు అర్థమైంది. ఈ వరసకు చివరన నేనుఇంతసేపూ గమనించని వస్తువు కనబడింది. నాకా క్షణంలో ఈర్ష్యా కలిగింది - ఎంతజడపదార్థమైనా ఇంతమందిని ఆకర్షించ గలిగిందంటే ఇంకా ఏం కావాలి, దీని గొప్ప తనానికి నిదర్శనం ? నేను ఉన్నాను ఏం లాభం ? ఒక్కరంటే ఒక్కరిని ఆకర్షించలేకపోయాను. అందుకే నాకింకా పెళ్ళి అయినా కాలేదు-ఈర్ష గా మరోసారి, అంతమంది స్త్రీలను ఆకర్షించుకోగలిగిన ఆ వీధి పంపుకేసి చూశాను.

బుద్ధభగవానుడు బతికిఉన్న సమయంలో ఇంతనిగ్రహశక్తి ప్రదర్శించాడో లేదో నాకు తెలీదుకానీ, అపుడు ఆవీధిపంపు మాత్రం బుద్ధుణ్ణి తలదన్నిందనిపించింది. ఇంతమంది స్త్రీలు చుట్టు ముట్టినా నిర్వికారంగ నిలబడి ఒక్కచుక్కైనా చిందకపోవటం ఆశ్చర్యంగా ఉంది. వీళ్లు తమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకొని తెలుగుప్రజల్లా నిశ్చింతగా ఉన్నారు.

నా కెంతో ముచ్చటగా ఉంది, అక్కడ ఆ దృశ్యాన్ని చూడ గలగటం!

ఇంతలో అందర్లో ఒకసారిగా, కలకాలం నిశ్శబ్దం రాజ్యం చేయ నట్లుగా, కలకలం చెలరేగింది. ఏమిటా అనుకొన్నాను- అటుకేసి చూశాను.

బుసలు కొడుతున్నాడు, బుస్సుబుస్సుమంటూ పంపారాయుడు. అం దరూ అతని కనుసన్న కోసం కాచి చూస్తున్నట్లుగా నిలబడ్డారు.

శాంతించినట్లుగా ఈ సారి బుసలు ఆగిపోయాయి. కుండలు బిందెలు.... అన్నీ యథాస్థానమాక్రమించాయి.

మళ్ళీక్షణం గడిచిందోలేదో.... మళ్ళీ బుసలు

బుస.... బుస.... బుస్.... రుప్.... ఆగిపోయింది బుస. కలకలమూ అంతే కిందటిసారికన్నా అరక్షణం ఎక్కువసేపు ఆగింది కలకలం.

మళ్లీ వో అరగంటసేపు ఏమీలేదు. ఈ అరగంటలో నేనుచాల తెలుసుకో గలిగాను. ప్రపంచంలో మహామేధావులెవరైనా ఉంటే వాళ్లు ఆడవాళ్లే అనిపించింది నాకు. ఒకావిడ వాళ్ళ ఇంట్లో అనిశ్చిత పరిస్థితికి కోడలి రాక ఎంత కారణమో చెబుతోంటే, ప్రక్కావిడ అది అమెరికాకు అన్వయించి చెపుతోంది. ఇంకోస్త్రీ వాళ్ళ ఇంట్లో, క్రమం తప్పకుండా తాగే భర్తవల్ల బంగారం ఎలా మాయమవుతోందో చెబుతోంటే, ఆమె పక్కనున్న లలన 'ప్రపంచంలో అంతా అలాగే ఉందం'టోంది. ఇంకో మహిళామణి తమ ఇంట్లో ఒకపూటే వంటచేయుటవల్ల ఎంతఆదా చేయ గలుగుతోందో చెబుతోంటే, ఆ పక్క ఇంతి తను రెండుపూటలా వంట చేయటం మానేసి, హోటల్ నుంచి తెప్పిస్తున్న సంగతి, దీనివల్ల జరిగే పొదుపు, అది దేశానికి ఎంత అవసరమో అన్న సంగతి అమోఘంగా లెక్చరిస్తోంది.

నాకు బాధ కలిగింది-వీళ్ళలో ఉన్న ఈచైతన్యం అంతా, దేశంలో ఉన్న నదీ జలాలు అన్నీ సముద్రంలో కలిసిపోయినట్లుగా, వృధా అయి పోవడమేనా అనిపించింది. నా చేతకాని తనానికి, దేశం దౌర్భాగ్యానికి [illegible]ంచపడ్డాను.

ఆ క్షణంలో మళ్ళీ బుసలు....

ఏమిటో, ఉత్త బుసలే కనబడుతున్నాయికానీ నీటి బొట్లు లేవు.

ఇద్దరు మహావ్యక్తులు ఒకే విధంగా ఆలోచిస్తారన్నట్లుగా, ఇంకొకరెవరో కూడా అదే అంటున్నారు. ఆవిడ, తన అక్క మొగుడి మేనమామ కొడుకు పెళ్లికి ఇలాగే నీళ్లకోసం ఎలా అవస్థ పడ్డారో, అప్పుడు అరమైలు దూరం నుంచి, ఉన్నబిందెలన్నిటితోనూ నీళ్లు పెళ్ళివాళ్లు ఎలా తేవాల్సి వచ్చిందో చాల రసవత్తరంగా చెబుతోంది.

బుస.... బుస.... బుస్....

ఈసారి అందరూ నిర్వికారంగానే వున్నారు.

మళ్ళీ బుసలు.... ఈ సారి బుసలతో పాటుగ రెండు నీటిబొట్లు రాలాయి.

అందరిలో కలకలం.

కోలాహలం.

అందరిలోనూ కోరిక, అవసరం-ఆత్రుత

కుండలు, బిందెలూ కదలాయి. ఒకరినొకరు తోసుకొంటూ - రాసుకొంటూ, ముందున్న వ్యక్తిదెవరిదో కానీ, కుండపగిలింది.

అంతే, బ్రహ్మాండం బద్దలయింది-అతని నోటమ్మట వెలువడిన నీతుల్లాంటి బూతులతో పక్కనున్న వ్యక్తిని అలంకరిస్తున్నాడు - ఆ ఆడమనిషీ తన ఆడతనాన్ని ఆ క్షణంలో మర్చిపోయి, ఎదురుకోసాగింది. బూతులు బండ నీతులు.

అందరూ చోద్యం చూస్తున్నారు.

తనూ ఈ చోద్యం చూడాలంటూ కాబోలు, పంపులోంచి నీరుధారగా కారుతూ, మురికి కాలువలో కలుస్తోంది.

నా జీవనది గర్వంగా కదులుతోంది.

దేవుడు నా దేశప్రజలకు అతిచైతన్యం ఇచ్చినందుకు ఆక్షణంలో తిట్టుకొన్నాను.

నా మనసులో బాధ కంట్లోంచి నీరుగా కిందకు కారసాగింది.

తోడుగా, జోడుగా, ఎదురుగా పంపులోంచి నీరు ఇంకా కిందకు కారుతూనే ఉంది.

[తరుణ, నవంబర్ '73]